E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 19-04-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:107 || పేజీలు–6

www.ekaburu.com




## డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు భేష్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అభినందనలు
- ప్రతిపక్ష ఐక్యతకు మద్దతుగా నిలిచినందుకు ప్రియాంక గాంధీకి సీఎం కృతజ్ఞతలు



ఈ కబురు, ఢిల్లీ:

నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలకు సంబంధించి బీజేపీ విధానంలో లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందించారు. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం

మిగతా 2లో

## స్వార్థ రాజకీయాల కోసం నారీశక్తిని అడ్డుకున్నారు

### ... ప్రధాని మోదీ



**ఈ కబురు, ఢిల్లీ:**

**భారత నారీశక్తి ఎదగకుండా విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. దేశ హితం కోసం, నారీ శక్తి హితం కోసం బిల్లు తెచ్చామన్న ఆయన.. మహిళా శక్తిని ఈ దేశం ఇంకా చూడాల్సి ఉందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం నారీ శక్తిని అడ్డుకున్నారని అన్నారు. " మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ అడ్డుకున్నాయి. అలాంటి కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవు. ఆ పార్టీలు ఓడించింది బిల్లును కాదు.. మహిళా శక్తిని. తమకు జరిగిన అన్యాయాన్ని మహిళలు ఎప్పటికీ మర్చిపోరు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కలిసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలకు తప్పకుండా శిక్ష పడుతుంది**

**ఆ పాపం వదిలిపెట్టదు**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పాపం వారిని వదిలిపెట్టదు. అన్ని విషయాలను మహిళలు గమనిస్తూనే ఉన్నారు. మహిళలు తమ హక్కు కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్నారు. రిజర్వేషన్ల కోసం ఎందరో మహిళలు పోరాటం చేశారు. ఎంతో నిజాయతీతో తెచ్చిన బిల్లును ప్రతిపక్ష నేతలు అడ్డుకున్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తీసుకోవాలని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేశాం. అన్ని రాష్ట్రాలకు సమాన బలం దక్కేలా బిల్లు తీసుకొచ్చాం. మహిళా బిల్లును అడ్డుకొని విపక్షాలు భ్రూణహత్యకు పాల్పడ్డాయి. ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ పార్టీలదే. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం విపక్షాలకు ఇష్టం లేదు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ.. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో చాలాసార్లు అడ్డుకుంది. మహిళా బిల్లును అడ్డుకొని విపక్ష పార్టీలు నిజస్వరూపం చూపించాయి. కాంగ్రెస్ పార్టీ పరాన్న జీవిలా బతికేస్తోంది. స్థానిక పార్టీలపై ఆధారపడి ఆ పార్టీ జీవిస్తోంది. మహిళా బిల్లుపై అవే కుట్రలు, కుతంత్రాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ, డీఎంకేకు ప్రజలు బుద్ధి చెబుతారు. నారీశక్తి వందన్ అధినియం బిల్లు వ్యతిరేకులు తగిన మూల్యం చెల్లించుకుంటారు.

మిగతా 2లో



హర్మూజ్‌ని దాటేందుకు యత్నించిన

### భారతీయ నౌకలపై కాల్పులు

ఈ కబురు : హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని దాటేందుకు యత్నించిన రెండు నౌకలపై

02



### భారీ మూల్యం చెల్లించుకుంటారు .. ప్రధాని మోదీ

ఈ కబురు: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు

02



6

## బెంగళూరులో దిల్లీ ధమాకా

రాణించిన రాహుల్, స్టబ్స్

సొంతగడ్డపై ఆర్సీబీకి తొలి ఓటమి

గుజరాత్‌తో మ్యాచ్‌లో 2 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన స్థితిలో సింగిల్ తీసే అవకాశమున్నా తీయక.. ఆఖరి బంతికి రనౌటై జట్టు ఓటమికి కారణమై విమర్శలు ఎదుర్కొన్న మిల్లర్.. ఈసారి దిల్లీ క్యాపిటల్స్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో 4 బంతుల్లో 13 పరుగులు చేయాల్సిన స్థితిలో చెలరేగి ఆడిన అతడు మూడు బంతుల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. వరుసగా 6, 6, 4తో దిల్లీని విజయ తీరాలకు చేర్చాడు. కెప్టెన్ అక్షర్ బంతితో, బ్యాటుతో రాణించగా.. రాహుల్, స్టబ్స్ అదిరే బ్యాటింగ్‌తో విజయంలో కీలకమయ్యారు.. ఈ సీజన్‌లో జోరు మీదున్న ఆర్సీబీకి చిన్నస్వామిలో ఇదే తొలి ఓటమి.



3

## చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని దూరం చేశారు

ఈ-కబురు, అమరావతి :

చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు దూరం చేశాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేది.

## తెలంగాణలో త్వరలో జడ్పిటిసి, ఎంపీటీసీ,ఎన్నికలు!



ఈ కబురు,హైదరాబాద్, తెలంగాణలో జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల,జడ్పీటీసీ, ఎంపీటీసీ,ఎన్నికలకు రంగం సిద్ధమైంది,ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల ని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది,దీంతో మరోసారి తెలం గాణలో ఎన్నికల నగరా మోగనుంది..

02

### మహిళా బిల్లును అడ్డుకోవటం

## ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే

రిజర్వేషన్ బిల్లు అడ్డుకుని జాతికి ద్రోహం చేశారు

మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి

నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



02

## అందుకే పార్లమెంట్‌లో వారిని ఓడించాం: రాహుల్ గాంధీ

ఈకబురు, : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పలు పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తమిళనాడులో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై స్పందించారు. వారి ఆలోచనను తాము అడ్డుకున్నామంటూ వ్యాఖ్యానించారు.



03



### బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి

ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి వినతి

ఈ-కబురు, ,ఢిల్లీ:

బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు

03

### జగిత్యాలలో పండుగ వాతావరణం కనిపిస్తోంది: కేటీఆర్



ఈ కబురు, జగిత్యాల:

జగిత్యాలలో ఒక పండుగ వాతావరణం కనిపిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జీవన్‌రెడ్డిని కలిసిన అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

మిగతా 3లో



03

### రేపు రెండో విడత.. రైతుభరోసా నిధుల విడుదల



### ఏఐతో ఆందోళనలు వద్దు .. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

03

## శత్రువులకు ఘోర పరాజయమే ... మొజ్తాబా ఖమేనీ

ఈ-కబురు, : ఇరాన్-అమెరికా మధ్య దౌత్య చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కీలక హెచ్చరికలు చేశారు. శత్రువులకు ఘోర పరాజయాన్ని రుచి చూపించడానికి తమ నౌకాదళం సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు ఇరుపక్షాలు ఉమ్మడి నిర్ణయం తీసుకునే వరకూ అమెరికాతో ఎటువంటి చర్చలు జరగవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్జా పేర్కొన్నారు.



03

# స్వార్థ రాజకీయాల కోసం నారీశక్తిని అడ్డుకున్నారు



--అదే కాంగ్రెస్ నైజం

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసత్యాలు ప్రచారం చేశాయి. స్వార్థ రాజకీయాలతో ఆయా రాష్ట్రాల ప్రజలనూ మోసం చేస్తున్నాయి. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టంగా చెప్పాను. అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని హామీ ఇచ్చాను. బిల్లు ఆమోదం పొందితే అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరిగేవి. సీట్లు పెరిగితే కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి అన్ని పార్టీలకు ప్రయోజనమే. రామ్ మనోహర్ లోహియా స్వప్నాలను సమాజ్‌వాదీ పార్టీ తుంగలో తొక్కింది. కాంగ్రెస్ పార్టీ సంస్కరణలకు ఎప్పుడూ వ్యతిరేకమే. జన్‌ధన్, డిజిటల్ పేమెంట్స్, జీఎస్టీని, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దును కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఉగ్రవాదం, నక్సలిజం విషయాల్లోనూ కాంగ్రెస్ వైఖరి మర్చిపోలేం. సంస్కరణ పేరు వింటే చాలు.. కాంగ్రెస్ వెంటనే వ్యతిరేకిస్తుంది. ఆ పార్టీవన్నీ నెగటివ్ రాజకీయాలు. ఏ సంస్కరణ వచ్చినా కాంగ్రెస్ అడ్డుకుంటుంది.. దుష్ప్రచారం చేస్తుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. దేశానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం. సైనికుల వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ అడ్డుకుంది. దేశంలోని మహిళలు, యువతులు కలిసి కాంగ్రెస్‌కు గట్టిగా జవాబిస్తారు'' అని మోదీ అన్నారు.

# డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు భేష్



ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం.... దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరఫున ప్రియాంక గాంధీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఏకగ్రీవంగా ఆమోదం పొందిన మహిళా బిల్లుతో సంబంధం లేకుండా, మహిళా సాధికారత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అనవసరమైన డీలిమిటేషన్ అజెండాను ముందుకు తీసుకువచ్చారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సీఎంతో అన్నారు.

# తెలంగాణలో త్వరలో జడ్పీటీసీ, ఎంపీటీసీ,ఎన్నికలు!



తెలంగాణలో జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల,జడ్పీటీసీ, ఎంపీటీసీ,ఎన్నికలకు రంగం సిద్ధమైంది,ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల ని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది,దీంతో మరోసారి తెలం గాణలో ఎన్నికల నగరా మోగనుంది... గత డిసెంబర్ నెలలో సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికలు పూర్తి కాగా.. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నిక లు కూడా నిర్వహించారు.తాజాగా.. ప్రత్యేకాధికారు ల పాలనలో ఉన్న మండల, జిల్లా ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందు కు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేసింది.ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి కీలక ఆదేశాలు జారీ అయ్యాయి.పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్,మేడ్చల్‌మల్కాజిగిరి మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేసింది.కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుండి 2026 ఫిబ్రవరి 5 వరకు సమీకరించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఈ ప్రక్రియ కొనసాగనుంది.



# భానుడి భగ భగ

**.. కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత**

ఈ కబురుహైదరాబాద్:

తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

--తెలంగాణలో ఈ నెల 26 వరకు వర్షాలు

రాష్ట్రంలో ఓ వైపు ఎండల తీవ్రత ఉన్నప్పటికీ మరి కొన్ని ప్రాంతాల్లో వర్షసూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఉపరితల అవర్తనం, ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ నెల 26 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఇవాళ జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్షసూచన ఉందన్నారు. వర్షం కురిసే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# భారీ మూల్యం చెల్లించుకుంటారు

**.. ప్రధాని మోదీ**



**ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది.**

# హర్మూజ్‌ని దాటేందుకు యత్నించిన భారతీయ నౌకలపై కాల్పులు



ఈ కబురు : హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని దాటేందుకు యత్నించిన రెండు నౌకలపై కాల్పులు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలు భారతీయ జెండాలతో ప్రయాణిస్తున్నట్టుగా తెలిసింది.హర్మూజ్ జలమార్గం ద్వారా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఐఆర్‌జీసీకి సంబంధించిన గన్ బోట్‌లు కాల్పులు జరిపాయి. అయితే.. ట్యాంకర్లు, అందులోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. కాల్పుల ప్రభావం తెలియాల్సి ఉంది.అమెరికాతో జరిగిన చర్చల సందర్భంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని కొద్ది సమయం పాటు తెరిచి ఉంచింది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగించడంతో ఆ జలసంధిని తిరిగి మూసివేసింది. ఈ ప్రకటన జరిగాక కొన్ని గంటల తర్వాత ఈ ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

**ఇరాన్ రాయబారికి భారత్ సమన్లు..**

**హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో కూడిన నౌకలపై దాడులను కేంద్రం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భారత్‌లోని ఇరాన్ రాయబారికి విదేశాంగశాఖ సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.**

# మహిళా బిల్లును అడ్డుకోవటం ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే






ఈ కబురు,నిడదవోలు, ఏప్రిల్ 18:

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ .." భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కల సాకారం అవుతుందని భావించాం. పార్లమెంటు, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నాం. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతిలో భాగం. నిన్న పార్లమెంటులో దీనికి భిన్నంగా జరిగింది. విపక్షాల వైఖరికి నిడదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం.మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నాను. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయి.

దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం.దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా.?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

**–విద్రోహంపై ఇంటింటికీ ప్రచారం**

"నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్తాం. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమే. దీనిపై పవన్ కల్యాణ్‌నూతో మాట్లాడాను. ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలి. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా? 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించాం. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేక పోయారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకు వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయి. దక్షిణాదికి,

ఉత్తరాది రాష్ట్రాలకు ఆన్యాయం జరుగుతుందని ఏవేవో ఆరోపణలు సాకులు చెప్పారు. లేని పోని సాకులతో బిల్లును డిఫీట్ చేయటం శోచనీయం. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదు.

జనాభాలో సగం ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధంగా పనిచేస్తున్నారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు తీసుకువచ్చారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయి.?

ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలి. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారు.

ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం". అని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

# సైబేజ్ ఆశ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి వాషింగ్ మెషిన్, ఎయిర్ కూలర్ల పంపిణీ



వాషింగ్ మెషిన్, కూలర్లతో సైబేజ్ ఉద్యోగులు, ఆశ్రమం వృద్ధులు, చిన్నారులు

ఈకబురు, శేరిలింగంపల్లి : మండుతున్న ఎండల నుంచి వృద్ధాశ్రమం వృద్ధులకు ఉపశమనం కల్పించేందుకు సైబేజ్ సాఫ్టువేర్ సంస్థ ముందుకు వచ్చింది. తమ సిఎస్ఆర్ నిధులతో వృద్ధ, అనాథ ఆశ్రమానికి వాషింగ్ మెషిన్, ఎయిర్ కూలర్లను అందజేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని మియాపూర్ వీడియా కాలనీలో వివేకానంద సేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వృద్ధాశ్రమం, అనాథాశ్రమానికి గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్వేర్ సంస్థ తోడ్పాటును అందించింది. ఎండాకాలంలో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని తమ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సైబేజ్ ఆశ పేరుతో 6 ఎయిర్ కూలర్లు, బట్టలు ఉతుక్కోవడానికి 12 కిలోల వాషింగ్ మెషిన్ ను సైబేజ్ కంపెనీ సీనియర్ సిఎస్ఆర్ ఎగ్జిక్యూటీవ్ సురేష్ అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సంఘం నిర్వాహకులు సుందర్ ప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులకు ఉపయోగపడే విధంగా వాషింగ్ మెషిన్, కూలర్లు అందజేసిన సైబేజ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సైబేజ్ సంస్థ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ సైబేజ్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. భవిష్యత్తులో సైతం వివేకానంద ఆశ్రమానికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు సైబేజ్ ముందుకు వస్తుందన్నారు. ఈ సందర్భంగా సైబేజ్ సంస్థ ఉద్యోగులు వృద్ధులతో సంతోషంగా గడుపడంతో పాటు వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. దీంతో పాటు వృద్ధులతో అంత్యాక్షరి ఆడి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో సైబేజ్ సంస్థ ఉద్యోగులు అనపురపు సురేష్, వెంకట రమణసాదు, దుర్గాప్రసాద్ రాథో, తిరుపతి, ఫణి కుమార్, కిరణ్మయి, రాజశ్రీ, శాంతకుమార్, సాయిక్రిష్ణ, సాయి, సంతోష్, బాపిరాజు, సాయిలతో పాటు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి



బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కు పరిశ్రమ) ఏర్పాటు చేయాలని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రులకు వివరించారు. తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కోరారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతల వలన దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబద్ కేంద్రంగా నిలవగలదని కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పే జాతీయ స్థాయి సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# బచ్ పన్, అకాడమి హెల్త్ పబ్లిక్ స్కూల్ లో "ఎర్త్ డే" వేడుకలు


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

## నేచర్స్ స్టైల్ షోతో విద్యార్థుల సందడి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : ఎర్త్ డే సందర్భంగా, చందానగర్‌లోని బచ్ పన్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 'నేచర్స్ స్టైల్ షో' పేరుతో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు హాజరై ప్రారంభించారు..**

ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తల్లిదండ్రుల సహకారంతో ప్రకృతి నుండి స్ఫూర్తి పొందిన విద్యార్థులు వినూత్న వేషధారణల్లో ర్యాంప్‌పై నడుస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. చెట్లు, పక్షులు, జంతువులు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రతిబింబించేలా వారి దుస్తులు రూపుదిద్దుకోవడం విశేషం. ప్రతి విద్యార్థి తన వేషధారణ ద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.
ఈ సందర్భంగా డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నప్పటి నుంచే పిల్లల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే విలువలను కూడా నేర్పుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించగా, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రీటా దాస్, టీచర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని దూరం చేశారు



ఈకబురు, అమరావతి :
చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు దూరం చేశాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేది. రానున్న రోజుల్లోనైనా మహిళా శక్తికి చట్ట సభల్లో సముచిత స్థానం దక్కుతుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ బిల్లును లోక్ సభ ముందుకు తీసుకువచ్చిన ప్రక్రియను ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా జనసేన పార్టీ స్వాగతిస్తుంది. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే యావత్ సమాజం మహిళలు ఎంతో సంతోషించి ఉండేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

# శత్రువులకు ఘోర పరాజయమే ... మొజ్తాబా ఖమేనీషా




ఏదేమైనప్పటికీ ఎవరి కోసమూ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించే ఎలాంటి దిగ్బంధనాన్ని టెహ్రాన్ అంగీకరించబోదని.. వాషింగ్టన్ నుంచి వచ్చే ఆదేశాలకు కట్టుబడి ఉండబోదని తెలియజేశారు. ఇతర దేశాలు ఎలా ఉండాలో చెప్పే హక్కు ఆ దేశానికి లేదని వ్యాఖ్యానించారు.
--పశ్చిమాసియా జలాల్లోకి తిరిగొచ్చిన జెరాల్డ్..
ఇరుదేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా (US) విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్' మళ్లీ పశ్చిమాసియా జలాల్లోకి ప్రవేశించింది. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ (USS Gerald R Ford).. మరమ్మతుల అనంతరం ఇతర విమాన వాహకనౌకలతో పాటు విధుల్లో చేరినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నెలరోజుల పాటు తూర్పు మధ్యధరా సముద్రంలో ఉన్న ఈ నౌక సూయజ్ కాలువను దాటి.. ఎర్రసముద్రంలోకి ప్రవేశించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు యూఎస్ఎస్ మహాన్, యూఎస్ఎస్ విన్‌స్టన్ ఎస్.చర్చిల్ అనే రెండు డిస్ట్రాయర్లు కూడా ఉన్నట్లు తెలిపారు. మరో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జార్జ్ హెచ్.డబ్ల్యూ.బుష్ సైతం పశ్చిమాసియా వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అది దక్షిణాఫ్రికా తీరంలో ఉంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో మోహరించి ఉంది. అగ్రరాజ్యం మళ్లీ పశ్చిమాసియాలో నౌకా దళాన్ని మోహరిస్తుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రపంచ దేశాలు కలత చెందుతున్నాయి.

# అందుకే పార్లమెంట్‌లో వారిని ఓడించాం: రాహుల్ గాంధీ



మీ స్పందన : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పలు పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తమిళనాడులో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై స్పందించారు. వారి ఆలోచనను తాము అడ్డుకున్నామంటూ వ్యాఖ్యానించారు.
''నాకు కొన్నేళ్లుగా తమిళనాడుతో అనుబంధం ఉంది. ఈ ప్రాంతానికి, ఇక్కడి ప్రజలకు నా హృదయంలో ప్రత్యేకమైన స్థానం ఉంది. జమ్ముకశ్మీర్‌కి వెళ్తే ఎలా నా సొంత ఇల్లులా అనిపిస్తుందో.. తమిళనాడుకు వచ్చినప్పుడు కూడా అదే భావన కలుగుతుంది. ఆర్ఎస్ఎస్, భాజపా కలిసి తమిళ భాష, సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీయాలని గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. అది చూసినప్పడల్లా వీరికెంత ధైర్యం అనిపిస్తుంటుంది'' అని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భాజపాపై విమర్శలు గుప్పించారు. ''భాజపా ఏప్రిల్ 16న పార్లమెంట్‌లో మహిళల రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. దాన్ని ఇప్పుడు పాస్ చెయ్యాలనుకున్నారు. నిజానికి ఆ బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. అయితే ఈ మహిళల రిజర్వేషన్ల వెనక నియోజకవర్గాల పునర్విభజన దాగిఉంది. రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం ప్రయత్నించింది. ఈ డీలిమిటేషన్ బిల్లు వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది. తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలను బలహీనం చేయడానికే భాజపా ఈ బిల్లును ప్రవేశపెట్టింది. అందుకే పార్లమెంట్‌లో మేమంతా ఆ బిల్లును అడ్డుకున్నాం'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



## రేపు రెండో విడత.. రైతుభరోసా నిధుల విడుదల

**ఈ కబురు, హైదరాబాద్:**
**తెలంగాణలో ఈ నెల 20వ తేదీన రెండో విడత రైతుభరోసా నిధులు విడుదల చేయనున్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వీటిని విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు జమ కానున్నాయి. మార్చి 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లు జమ చేసిన సంగతి తెలిసిందే.**

# ఏఐతో ఆందోళనలు వద్దు
## ..సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



ఈ కబురు : కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ (CJI) కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఏఐ గురించి భయపడొద్దని న్యాయాధికారులకు సూచించారు. ''టెక్నాలజీ అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుంది. అది మనుషులకు ప్రత్యామ్నాయం కాదు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ(AI)ను అనుసంధానం చేయాలంటే సమతుల్యతను పాటించాలి. అంటే ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, న్యాయ సంబంధిత విషయాల్లో మానవ మేధస్సు, అనుభవాన్ని ఉపయోగించాలి'' అని సీజేఐ అన్నారు. ''క్లిష్టమైన ప్రశ్నలతో ఉన్న ఓ కేసు మీ ముందుకు వస్తే మీరేం చేస్తారు?ఆ సమస్యను పరిష్కరించడానికి మరింత సమయం వెచ్చించి, ఆలోచిస్తారు. ఓపిగ్గా పనిచేస్తారు. అలాంటి కేసును పరిష్కరించాక గొప్ప అనుభూతి పొందుతారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చు. అందువల్ల మీరు భయపడాల్సిన పనిలేదు. న్యాయాధికారులు ఉత్పాదకతను మెరుగుపరచడానికి తగిన శిక్షణ తీసుకుంటారు. ఎక్కువ సమయం కేటాయించి, శ్రద్ధతో, సమర్థవంతంగా పని చేయగలరు'' అని సీజేఐ పేర్కొన్నారు. ''ఏఐ డేటా ఆధారంగా పని చేస్తుంది. మనుషులకు ఉండే విచక్షణా శక్తి దానికి ఉండదు. అలాగే నిర్ణయాలు తీసుకునేటప్పుడు మనుషుల్లా ఆలోచించలేదు. నైతిక విలువలు, సామాజిక కోణాలతో మమేకమై నిర్ణయాలు తీసుకోలేదు. రాజ్యాంగ నియమాలు, విలువలకు కట్టుబడి కేసులను పరిష్కరించాలి. ఎలాంటి ఉద్వేగాలు లేని ఏఐ వల్ల ఇది సాధ్యం కాదు'' అని విశ్లేషించారు.

# జగిత్యాలలో పండుగ వాతావరణం కనిపిస్తోంది: కేటీఆర్



మాజీ సీఎం కేసీఆర్‌కు తెలిసిందే ప్రజలను కలవడమని అన్నారు. కేసీఆర్ ఇక్కడికి వస్తున్నారంటే.. సీఎం మేడిగడ్డ పోతున్నారని వ్యాఖ్యానించారు. '' కోరుట్ల నుంచి రాకుండా ఇప్పుడు రోడ్డు తవ్వుతున్నారు. ఇన్ని రోజులు రోడ్డు గుర్తుకురాలేదు. గతంలో ఎన్నో బహిరంగసభలు ఇక్కడ జరిగాయి. ఇప్పుడు కూడా సభ విజయవంతమవుతుంది'' అని కేటీఆర్ అన్నారు. జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో ఈనెల 20న కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. కేసీఆర్ సమక్షంలో సీనియర్ నేత జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్నారు.ఈ క్రమంలో సభా ఏర్పాట్లను హరీశ్‌రావు, కేటీఆర్ పరిశీలించారు.




## స్మార్ట్ ఫోన్‌లో 'ఆధార్' ప్రీ-ఇన్‌స్టాలేషన్‌పై అప్‌డేట్

స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల ప్రయోజనాలు, టెక్ కంపెనీల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో విక్రయించే యాపిల్, శామ్‌సంగ్ వంటి ప్రముఖ కంపెనీల ఫోన్లలో ఆధార్ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ (ప్రీఇన్‌స్టాలేషన్) చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ప్రస్తుతానికి పక్కన పెట్టింది. గత కొద్ది కాలంగా ఈ అంశంపై పరిశ్రమ వర్గాల్లో జరుగుతున్న చర్చకు ఈ నిర్ణయంతో తెరపడినట్లయింది.

పరిశ్రమ వర్గాల వ్యతిరేకతే కారణమా?

రాయిటర్స్ నివేదిక ప్రకారం, స్మార్ట్‌ఫోన్‌ల్లో ఆధార్ యాప్‌ను తప్పనిసరిగా చేర్చాలన్న ప్రతిపాదనపై యాపిల్, శామ్‌సంగ్ వంటి గ్లోబల్ టెక్ కంపెనీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ(మైటీ) పరిశ్రమకు చెందిన వివిధ వాటాదారులతో సుదీర్ఘంగా సంప్రదింపులు జరిపింది. ఈ చర్చల అనంతరం స్మార్ట్‌ఫోన్లలో ఆధార్ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేయడాన్ని తప్పనిసరి చేయడం సరైన నిర్ణయం కాదని కేంద్రం భావించినట్లు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ధ్రువీకరించింది.

ఏమిటీ 'ప్రీఇన్‌స్టాలేషన్' వివాదం?

సాధారణంగా ఫోన్ కొన్నప్పుడు అందులో ఉండే క్యాలెండర్, కాలిక్యులేటర్ లేదా గడియారం వంటి యాప్‌ల మాదిరిగానే ఆధార్ యాప్‌ను కూడా ఫోన్ తయారీ దశలోనే ఇన్‌స్టాల్ చేయాలని ప్రభుత్వం తొలుత భావించింది. 134 కోట్ల మంది భారతీయులకు సంబంధించిన 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్) ఆధారిత సేవలను సులభతరం చేయడం దీని లక్ష్యం. ఈ ప్రక్రియ ద్వారా బ్యాంకింగ్, టెలికాం, ఇతర ప్రభుత్వ సేవలకు డిజిటల్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని భావించారు. అయితే, వినియోగదారుల గోప్యత, ఫోన్ సాఫ్ట్‌వేర్ పనితీరుపై ఇది ప్రభావం చూపుతుందని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి.

సంచార్ సాథీ అనుభవంతో వెనక్కి..

గతంలో సంచార్ సాథీ (మోసాలను నివేదించే యాప్)ను 90 రోజుల్లోగా అన్ని మొబైళ్లలో ఇన్‌స్టాల్ చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పుడు కూడా మొబైల్ కంపెనీల నుంచి ఇలాంటి ప్రతిఘటనే ఎదురైంది. భద్రతా పరమైన అంశాలు, వినియోగదారుల ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వాదన బలంగా వినిపించడంతో ప్రభుత్వం ఇప్పుడు ఆధార్ విషయంలో వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యం మంచిదే అయినప్పటికీ స్మార్ట్‌ఫోన్ తయారీదారుల గ్లోబల్ పాలసీలు, వినియోగదారుల డేటా సెక్యూరిటీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఆహ్వానించదగినది.

## రద్దు చేసిన నోట్ల మార్పిడికి ఆర్‌బీఐ కొత్త రూల్స్ తెచ్చిందా?




ద్దయిన పాత కరెన్సీ నోట్లు మార్చుకోవడానికి అనుమతిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కొత్త మార్గదర్శకాలు ఇచ్చిందంటూ కొన్ని కథనాలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వార్తలు తప్పని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి ఆర్‌బీఐ ఎలాంటి నిబంధనలూ జారీ చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. కచ్చితమైన, ధ్రువీకరించిన సమాచారం కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది. ఏవైనా అనుమానాస్పద మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు ప్రజల దృష్టికి వస్తే పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగానికి (PIB Fact Check) పంపాలని విజ్ఞప్తి చేసింది. వాట్సప్ నంబర్ +91 8799711259, లేదా factcheck@pib.gov.in ద్వారా ఈమెయిల్ చేయొచ్చని సూచించింది.2016 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం అకస్మాత్తుగా రూ.500, 1000 నోట్లను రద్దు చేసింది. దీంతో ఏర్పడిన కరెన్సీ కొరతను తీర్చేందుకు రూ.2000 నోట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత రూ.2000 నోట్లను వినియోగం నుంచి ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

# రైలు టికెట్ రహస్యం తెలుసా?

**భారతీయ రైల్వే.. ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థల్లో ఒకటి. ప్రతిరోజూ కోట్లాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి రైళ్లపై ఆధారపడుతుంటారు. అయితే, మీరు ఎప్పుడైనా గమనించారా? మనం బుక్ చేసుకునే ప్రతి రిజర్వేషన్ టికెట్‌పైనా 10 అంకెల పీఎన్ఆర్ (PNR) సంఖ్య ఉంటుంది. అసలు ఈ నంబర్ వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అది కేవలం ఒక సంఖ్యేనా లేక అందులో ఏవైనా వివరాలు దాగి ఉన్నాయా?**



### ఏమిటీ పీఎన్ఆర్?

పీఎన్ఆర్ అంటే 'ప్యాసింజర్ నేమ్ రికార్డ్'. ఇది రైల్వే డేటాబేస్‌లో ప్రయాణికుడికి కేటాయించే ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్య. సీటు కన్ఫర్మ్ అయిందా లేదా? ఏ కోచ్‌లో బెర్త్ కేటాయించారు? ప్రయాణ తేదీ, రైలు వివరాలు వంటి కీలక సమాచారమంతా ఈ 10 అంకెల వెనుక నిక్షిప్తమై ఉంటుంది.

### పది అంకెలే ఎందుకంటే..

లక్షల కొద్దీ బుకింగ్స్ జరిగే మన దేశంలో, తక్కువ అంకెలు ఉంటే నంబర్లు రిపీట్ అయ్యే అవకాశం ఉంటుంది. అదే ఎక్కువ అంకెలు ఉంటే గుర్తుంచుకోవడం కష్టం. అందుకే, నిర్వహణకు సులభంగా ఉంటూనే, బిలియన్ల కొద్దీ ప్రత్యేకమైన కాంబినేషన్లను సృష్టించేందుకు 10 అంకెల ఫార్మాట్‌ను రైల్వే ఎంచుకుంది.

ఈ 10 అంకెలు యాదృచ్ఛికంగా ఇచ్చేవి కావు. ఇందులో ప్రతి అంకెకు ఒక అర్థం ఉంది.

మొదటి అంకె: ఇది టికెట్ ఏ రైల్వే జోన్ లేదా ఏ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (PRS) ద్వారా బుక్ అయిందో సూచిస్తుంది. ఉదాహరణకు 2 లేదా 3 తో మొదలైతే అది సికింద్రాబాద్ (SCR) వంటి జోన్లకు సంబంధించినదిగా గుర్తించవచ్చు.

మొదటి 3 అంకెలు: ఇవి రిజర్వేషన్ జరిగిన జోనల్ క్లస్టర్‌ను తెలియజేస్తాయి.చివరి 7 అంకెలు: ఇవి సిస్టమ్ ద్వారా ఆటోమేటిక్‌గా జనరేట్ అయ్యే యూనిక్ నంబర్లు. ఇవి ఒకే ప్రయాణంలో ఇద్దరు వ్యక్తులకు ఒకే నంబర్ రాకుండా అడ్డుకుంటాయి.

### పీఎస్ఆర్ వ్యవస్థ ఎందుకు కీలకం?

కోట్లాది మంది డేటాను గందరగోళం లేకుండా నిర్వహించడానికి పీఎన్ఆర్ వ్యవస్థ వెన్నెముకలా పనిచేస్తుంది. దీని ద్వారా వెయిటింగ్ లిస్ట్ (WL) లేదా RAC లో ఉన్న టికెట్ కన్ఫర్మ్ అయిందో లేదో క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఒకే సీటు ఇద్దరికి కేటాయించకుండా ఈ వ్యవస్థ అడ్డుకుంటుంది.అత్యవసర సమయాల్లో ప్రయాణికుల పూర్తి వివరాలను రైల్వే అధికారులు త్వరగా సేకరించేందుకు ఇది తోడ్పడుతుంది. మనం సాధారణంగా చూసే ఆ 10 అంకెల కోడ్ వెనుక ఇంతటి భారీ సాంకేతిక వ్యవస్థ దాగి ఉంది. భారత్ వంటి భారీ జనాభా ఉన్న దేశంలో రైలు ప్రయాణాన్ని క్రమబద్ధీకరించడంలో పీఎన్ఆర్ నంబర్ పోషిస్తున్న పాత్ర అమోఘం. ఈసారి మీరు టికెట్ బుక్ చేసుకున్నప్పుడు ఈ వివరాలన్నీ మీ పీఎన్ఆర్‌లో గమనించండి.

# డీఏ పెంపు.. కేంద్ర ఉద్యోగులకు ఇక మరింత జీతం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వ ఉద్యోగుల డియర్నెస్ అలవెన్స్ (DA)ను 2 శాతం పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తాజా పెంపుతో డీఏ ప్రస్తుతం ఉన్న 58 శాతం నుండి 60 శాతానికి చేరుకుంది.

గత అక్టోబర్‌లో ప్రభుత్వం డీఏను 55% నుండి 58 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఆ నిర్ణయం జూలై 1, 2025 నుండి అమలులోకి వచ్చింది. ఇప్పుడు ప్రకటించిన అదనపు 2 శాతం పెంపుతో కోటి మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.

జీతం ఎంత పెరుగుతుందంటే?

ఈ పెంపు వల్ల నెలవారీ వేతనంలో మార్పులను ఒక ఉదాహరణ ద్వారా పరిశీలిస్తే.. ఒక ఉద్యోగి ప్రాథమిక వేతనం (Basic Pay) రూ.50,000 అనుకుందాం. పాత రేటు (58%) ప్రకారం డీఏ రూ.29,000. కొత్త రేటు (60%) ప్రకారం డీఏ రూ.30,000. అంటే, ప్రతి నెలా నేరుగా రూ.1,000 అదనంగా లభిస్తుంది. దీనితో పాటు జనవరి నుండి రావాల్సిన బకాయిలు (Arrears) కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతాయి.

8వ వేతన సంఘానికి డిమాండ్లు

ఒకవైపు డీఏ పెరుగుతున్నప్పటికీ, ఉద్యోగ సంఘాలు 8వ వేతన సంఘం (8th Pay Commission) ఏర్పాటుపై ఒత్తిడి పెంచుతున్నాయి. నేషనల్ కౌన్సిల్‌జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ 3.83 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను డిమాండ్ చేస్తోంది. ఇదే గనుక అమలైతే కనీస వేతనం రూ.18,000 నుండి ఏకంగా రూ.69,000కు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత డీఏ పెంపు వల్ల సుమారు 1.19 కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది.



# మెటాలో భారీ లేఆఫ్‌లు.. 16,000 మందిపై వేటు?



సోషల్ మీడియా దిగ్గజం మెటా ప్లాట్‌ఫార్మ్స్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోంది. రాబోయే నెలల్లో సుమారు 16,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా మొదటి దశ మే 20న ప్రారంభం కానుందని, తొలి విడతలోనే దాదాపు 8,000 మంది ఉగ్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని రాయిటర్స్ నివేదిక పేర్కొంది. ఇది మెటా ప్రపంచ శ్రామిక శక్తిలో సుమారు 10 శాతం వంతు కావడం గమనార్హం.

మార్క్ జుకర్‌బర్గ్ నాయకత్వంలోని మెటా, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)పై ప్రత్యేక దృష్టి సారించింది. భవిష్యత్తులో కార్యకలాపాలను మరింత ఆటోమేషన్ చేసే దిశగా కంపెనీ తన శ్రామిక శక్తిని పునర్నిర్మిస్తోంది. కేవలం ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కోసమే ఏడాదికి సుమారు 135 బిలియన్ డాలర్ల భారీ వ్యయాన్ని కంపెనీ ప్రణాళిక చేస్తోంది. ఈ వ్యూహాత్మక మార్పుల వల్లే ప్రస్తుత ఉద్యోగ కోతలు అనివార్యమవుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే 2022, 2023 మధ్య కాలంలో మెటా దాదాపు 21,000 మంది ఉద్యోగులను తొలగించింది. కోవిడ్ మహమ్మారి సమయంలో అధిక విస్తరణ, తదనంతర ఆర్థిక మందగమనం వల్ల ఆ నిర్ణయాలు తీసుకున్నట్లు అప్పట్లో కంపెనీ వెల్లడించింది. తాజాగా ఇప్పుడు ఏఐ పురోగతి, ఉద్యోగుల ఉత్పాదకతను ప్రాతిపదికగా తీసుకుని తుది జాబితాను ఎగ్జిక్యూటివ్‌లు సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, స్టాక్ మార్కెట్‌లో కంపెనీ పనితీరును మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ లేఆఫ్‌లు సాగనున్నాయి. 2026 చివరి నాటికి మరిన్ని ఉద్యోగ కోతలు ఉండే అవకాశం ఉందని, దీనివల్ల ప్రభావితమయ్యే మొత్తం ఉద్యోగుల సంఖ్య 16,000కు చేరుకోవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామం ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో మరోసారి తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది.

# కొత్త క్రెడిట్ కార్డు.. ఎల్ఈడీ లైట్లతో..

ముంబై: ప్రముఖ రుణ సేవల ప్లాట్‌ఫాం 'చెక్', ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ దేశంలోనే తొలి కో–బ్రాండెడ్ ఎల్ఈడీ క్రెడిట్ కార్డును ఆవిష్కరించాయి. సులభతర చెల్లింపులు, గరిష్ఠ రివార్డు పాయింట్లే లక్ష్యంగా క్రెడిట్ కార్డు వినియోగదారులకు వినూత్న అనుభవాన్ని అందించేందు కు చెక్ ఏయూ క్రెడిట్ కార్డు పేరుతో దీన్ని మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు ప్రకటించాయి.

ఎల్ఈ డీ ఆధారిత చెల్లింపుల ట్యాపింగ్ విధానం ఈ క్రెడిట్ కార్డు ప్రత్యేకత అని చెక్ వ్యవస్థాపకుడు, సీఈవో ఆదిత్య సోని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఓఎస్ యంత్రాల ద్వారా జరిపే ప్రతి చెల్లింపు సందర్భంగా క్రెడిట్ కార్డులోని ఎల్ఈడీ లైటు వెలుగుతుందని.. తద్వారా చెల్లింపు ధ్రువీకరణ తక్షణమే కనిపిస్తుందని వివరించారు.

ఇందుకు బ్యాటరీ అవసరం లేదని.. పీఓసీలోని ఎన్ఎఫ్‌సీ ఫీల్డ్ సాయంతో ఎల్ఈడీ కాంతి ప్రసరిస్తుందన్నారు. ఈ సరికొత్త క్రెడిట్ కార్డు కావాలనుకొనే వారు చెక్ యాప్ లో ఈ నెల 28 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.



## సంగీత దర్శకుడిగా అదే నా బలం



"మంచి ప్రేమకథతో కూడిన కుటుంబ కథా చిత్రం 'గోదారి గట్టుపైన" అన్నారు సంగీత దర్శకుడు నాగ వంశీ. సుమంత్ ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమాని సుభాష్ చంద్ర తెరకెక్కించారు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మే 8న రానుంది. ఈ నేపథ్యంలోనే నాగ వంశీ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథతో రూపొందింది. దీంట్లో ఓ రెట్రో పాటని సీనియర్ గాయకులు చిత్ర, చరణ్‌లతో పాడించాం. అది నిజంగా నా అదృష్టం. ఈ సినిమా తప్పకుండా నా కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచిపోతుందని నమ్ముతున్నా. ఈ కథలో సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉంది. దీంట్లోని ఓ భావోద్వేగభరిత పాటకి ట్యూన్ సిద్ధం చేయడానికి నాకు చాలా సమయం పట్టింది. ఆ గీతాన్ని కాలభైరవతో పాడించాం. నాకు మెలోడీస్ అంటే చాలా ఇష్టం. అదే నా బలం అని నమ్ముతా. ఇక సంగీత దర్శకుడిగా నాకు స్ఫూర్తి ఇళయరాజా" అని చెప్పారు.



## విజయ్ దేవరకొండ కొత్త సినిమా అనౌన్స్‌మెంట్.. పోస్టర్ అదుర్స్

ఇప్పటికే రెండు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ (Vijay Deverakonda).. శౌర్యువ్ దర్శకత్వంలో నటించే అవకాశాలున్నాయంటూ ఇటీవల ప్రచారం జరిగింది. దానిపై శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. శౌర్యువ్‌తో సినిమాని ప్రకటిస్తూ.. విజయ్ షేర్ చేసిన పోస్టర్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ పోస్టర్‌తో మూవీ టీమ్‌ని పరిచయం చేశారు. జంతువులు, ఆయుధాలను హైలైట్ చేయడంతో ఇది వైలెంట్ మూవీ అని అర్థమవుతోంది. 'ఈ కోపమంతా ఒకప్పుడు ప్రేమే' అనే క్యాప్షన్ బట్టి.. ప్రేమలో విఫలమైన ఓ యువకుడి కథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది.'హాయ్ నాన్న'తో తొలి ప్రయత్నంలోనే మెప్పించిన దర్శకుడు శౌర్యువ్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో విజయం అందుకున్న ఆయన.. ఇప్పుడు యాక్షన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు పోస్టర్‌ని చూస్తే తెలుస్తోంది. 'VDxShouryuv' వర్కింగ్ టైటిల్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమాకి హేషబ్ అబ్దుల్ సంగీత దర్శకుడు. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ అలెజండ్రో మార్టినెజ్ ఈ చిత్రానికి వర్క్ చేయనుండటం విశేషం. హీరోయిన్ వివరాలు ఇంకా ప్రకటించలేదు. రాహుల్ సాంకృత్యాన్ డైరెక్షన్‌లో 'రణబాలి'లో నటిస్తున్నారు విజయ్. ఇదొక పీరియాడికల్ యాక్షన్ మూవీ. రష్మిక హీరోయిన్. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది. మరోవైపు, రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన'లో విజయ్ నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేశ్ హీరోయిన్.

# తెలుగు టు హిందీ...

## చేతి నిండా ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!



తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.

## నేనెందుకు సినిమాలు చేస్తున్నానన్నది.. అతడు గుర్తుచేశాడు: శేష్



హైదరాబాద్: తానెందుకు సినిమాలు చేస్తున్నానన్నది ఓ అభిమాని గుర్తుచేశాడని నటుడు అడివి శేష్ (Adivi Sesh) అన్నారు. శనివారం నిర్వహించిన.. తన కొత్త సినిమా 'డెకాయిట్' (Dacoit) థాంక్యూ మీట్‌లో మాట్లాడారు. శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన చిత్రమిది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఏప్రిల్ 10న విడుదలైన ఈ రొమాంటిక్ యాక్షన్ మూవీ ఇప్పటి వరకూ రూ.50+ కోట్లు వసూలు చేసింది. ఈ సందర్భంగా వేడుక నిర్వహించారు.

శేష్ మాట్లాడుతూ.. "డెకాయిట్'కు సంబంధించి ఓ వేడుకను బెంగళూరులో నిర్వహించాం. ఆ సమయంలో తమిళనాడు నుంచి వచ్చిన ఓ అభిమాని నాతో మాట్లాడారు. 'ఇటీవల నాపై చాలామంది దాడి చేశారు. చికిత్స కోసం చాలా రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. అక్కడున్నంత సేపు బయటకు రావాలంటే భయమేసింది. అలాంటి నాకు ధైర్యాన్నిచ్చింది మీ 'మేజర్' సినిమానే. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాక థియేటర్‌కు వెళ్లి 'డెకాయిట్' చూశా' అని చెప్పాడు. నా సినిమాల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. నేను ఎందుకు సినిమాలు చేస్తున్నానన్నది గుర్తుచేశాడు. నేనింకా కష్టపడాలని ఆ క్షణం అనిపించింది""సినిమా నచ్చితే ప్రేక్షకులు కొత్త వారిని ప్రోత్సహిస్తున్నారు. తమకు నచ్చకపోతే పెద్ద నటుల సినిమాలైనా చూడటం లేదు. మా సినిమాని ఆదరించిన ఆడియన్స్, మీడియా, ఇండస్ట్రీకి కృతజ్ఞతలు. ఈ సినిమా గురించి రామ్‌చరణ్ పెట్టిన పోస్టు చూసి షాకయ్యా. నాని కూడా ఫోన్ చేసి.. సినిమా బాగుందని చెప్పారు. నా కెరీర్‌లో ఫస్ట్ మ్యూజికల్ హిట్ కొట్టా. డ్యాన్స్ చేయగలిగిన సాంగ్స్ 'డెకాయిట్'లోనే ఉన్నాయి" అని పేర్కొన్నారు.

## ఓటీటీలోకి మలయాళ పొలిటికల్ థ్రిల్లర్ మూవీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

మలయాళ సినిమాలకు ఓటీటీ ప్రేక్షకుల్లో క్రేజ్ మరో స్థాయిలో ఉంటుంది. ఈవారం 'జియో హాట్‌స్టార్' (Jio Hotstar)లోకి వచ్చిన మిస్టరీ థ్రిల్లర్ 'సంభవం అధ్యాయం ఒన్ను' థ్రిల్ చేసింది. ఇదే ఓటీటీలో వచ్చేవారం పొలిటికల్ థ్రిల్లర్ డ్రామా రాబోతోంది. అదే 'ప్రతిఛాయ' (Prathichaya). ఏప్రిల్ 24 (Prathichaya Streaming Date) నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగులో స్ట్రీమింగ్‌పై స్పష్టత లేదు. నివిన్ పౌలీ (Nivin Pauly) హీరోగా బి. ఉన్నికృష్ణన్ తెరకెక్కించిన చిత్రమిది. కేరళ రాజకీయాల చుట్టూ తిరిగే ఫిక్షన్ స్టోరీ ఇది. కె.ఎన్. వర్గీస్ కేరళ ముఖ్యమంత్రి. సీఎం తనను లైంగిక వేధించాడంటూ ఓ మహిళ ఆరోపిస్తుంది. కొన్ని రోజుల తర్వాత తీవ్ర మనస్తాపంతో వర్గీస్ మరణిస్తాడు. దీంతో, తనకు పెద్దగా ఆసక్తి లేకపోయినా రాజకీయాల్లోకి వెళతాడు వర్గీస్ కుమారుడు జాన్ (నివిన్). అతడికి పాలిటిక్స్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? తన తండ్రి నిజంగానే మహిళను వేధించాడా? వర్గీస్ మరణానంతరం కేరళ రాజకీయాల్లో ఎలాంటి మార్పొచ్చింది? అన్నది ఈ సినిమా కథ.



## 'ది బ్రేకింగ్ న్యూస్' కోసం ఎదురు చూస్తున్నా : చిరంజీవి



'ది బ్రేకింగ్ న్యూస్' మూవీ ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన చిరంజీవి

ప్రముఖ నటులు మురళీ మోహన్, అనన్య నాగళ్ల, వాసుదేవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది బ్రేకింగ్ న్యూస్'. ఈ చిత్రానికి పవన్ కడియాల దర్శకత్వం వహిస్తున్నారు. ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై హనుమంత్ రెడ్డి, ఉమ గుటూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, 'ఈ సినిమాను చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మురళీ మోహన్‌ని ఇంత అగ్రెసివ్‌గా, ఆగ్రహభరితమైన పాత్రలో నేను ఎప్పుడూ చూడలేదు' అని తెలిపారు. అలాగే అనన్య నాగళ్ల నటనను కూడా ప్రశంసించారు. దర్శకుడు పవన్ కడియాల ఈ చిత్రాన్ని ఎంతో ఆసక్తికరంగా, విభిన్నంగా తెరకెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్ర బృందం తెలిపిన వివరాల ప్రకారం, 'ది బ్రేకింగ్ న్యూస్' ఒక మీడియా నేపథ్యంతో కూడిన థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఈ సినిమాను 2026 మే నెలలో థియేటర్లలో విడుదల చేయాలని యోచిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

## నెగెటివ్ క్యారెక్టర్ లో నటించడంపై రాశి స్పందన



ఒకప్పుడు తెలుగు తెరపై వెలిగిపోయిన హీరోయిన్ రాశి, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌లో బిజీగా ఉన్నారు. తిరువీర్ హీరోగా నటించిన 'పాపం ప్రతాప్' సినిమా నిన్న (శుక్రవారం) విడుదలై మంచి ఆదరణ పొందుతున్న తరుణంలో, ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో రాశి తన సినీ ప్రస్థానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మహేశ్ బాబు హీరోగా వచ్చిన 'నిజం' సినిమాలో తాను చేసిన నెగెటివ్ షేడ్ ఉన్న పాత్ర గురించి ప్రస్తావిస్తూ.. "ఆ రోల్ అంత నెగెటివ్‌గా మారుతుందని నేను అస్సలు ఊహించలేదు" అని పేర్కొన్నారు. కేవలం ఒక నటిగా అన్ని రకాల షేడ్స్ చేయాలనే ఉద్దేశంతోనే ఆ సినిమాలో నటించానని చెప్పారు.

ఇకపై తాను చేసే పాత్రల విషయంలో చాలా స్పష్టంగా ఉంటానని రాశి తెలిపారు. "'పాపం ప్రతాప్' దర్శకుడు నా కోసమే ఈ పాత్ర రాశానని చెప్పారు. పాత్రలో దమ్ముండి, అది ప్రేక్షకులకు నచ్చుతుంది అనుకుంటేనే గ్రీన్ సిగ్నల్ ఇస్తాను. అది పాజిటివా, నెగెటివా అన్నది నాకు ముఖ్యం కాదు" అని ఆమె వివరించారు. గోపీచంద్ విలన్‌గా మెరిసిన 'నిజం'లో రాశి చేసిన బోల్డ్, నెగెటివ్ పాత్ర అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత ఆమె ఒక మంచి హిట్ మూవీతో ప్రేక్షకులను పలకరించడం విశేషం.

# బెంగళూరులో దిల్లీ ధమాకా

**రాణించిన రాహుల్, స్టబ్స్**
**సొంతగడ్డపై ఆర్సీబీకి తొలి ఓటమి**


**గుజరాత్‌తో మ్యాచ్‌లో 2 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన స్థితిలో సింగిల్ తీసే అవకాశమున్నా తీయక.. ఆఖరి బంతికి రనౌటై జట్టు ఓటమికి కారణమై విమర్శలు ఎదుర్కొన్న మిల్లర్.. ఈసారి దిల్లీ క్యాపిటల్స్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో 4 బంతుల్లో 13 పరుగులు చేయాల్సిన స్థితిలో చెలరేగి ఆడిన అతడు మూడు బంతుల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. వరుసగా 6, 6, 4తో దిల్లీని విజయ తీరాలకు చేర్చాడు. కెప్టెన్ అక్షర్ బంతితో, బ్యాటుతో రాణించగా.. రాహుల్, స్టబ్స్ అదిరే బ్యాటింగ్‌తో విజయంలో కీలకమయ్యారు.. ఈ సీజన్‌లో జోరు మీదున్న ఆర్సీబీకి చిన్నస్వామిలో ఇదే తొలి ఓటమి.**

**బెంగళూరు**

రెండు ఓటముల తర్వాత దిల్లీ క్యాపిటల్స్ విజయాన్నందుకుంది. శనివారం రసవత్తరంగా సాగిన పోరులో 6 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. సాల్ట్ (63; 38 బంతుల్లో 4×4, 3×6) మెరవడంతో మొదట ఆర్సీబీ 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (2/18), కుల్‌దీప్ యాదవ్ (2/32), ఎంగిడి (2/39) ఆ జట్టుకు కళ్లెం వేశారు. స్టబ్స్ (60 నాటౌట్: 47 బంతుల్లో 4×4, 1×6), రాహుల్ (57; 34 బంతుల్లో 6×4, 2×6) చెలరేగడంతో లక్ష్యాన్ని దిల్లీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డేవిడ్ మిల్లర్ (22 నాటౌట్; 10 బంతుల్లో 1×4, 2×6) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు .భువనేశ్వర్ (3/26), కృనాల్ పాండ్య (1/24) మెరుగ్గా బౌలింగ్ చేసినా ఫలితం లేకపోయింది.

తడబడి.. నిలబడి..: పిచ్ మందకొడితనం, ఆర్సీబీ బౌలింగ్ నాణ్యత దృష్ట్యా 176 పరుగుల ఛేదన దిల్లీకి తేలికైందేమీ కాదు. అలాంటి స్థితిలో ఛేదనను ఆరంభించిన దిల్లీ.. 18 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. నిశాంక (1), రిజ్వీ (5), కరుణ్ నాయర్ (5)లను భువనేశ్వర్ ఔట్ చేశాడు. ఆ దశలో స్టబ్స్, రాహుల్ జట్టును ఆదుకున్నారు. స్టబ్స్ సహకరిస్తుండగా రాహుల్ చెలరేగిపోయాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో కళ్లు చెదిరే షాట్లు ఆడాడు. అతడు వేసిన ఓ ఓవర్లో ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. రాహుల్ 30 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 11వ ఓవర్లో జట్టు స్కోరు 87 వద్ద అతడు ఔటయ్యాక.. క్రీజులోకి వచ్చిన అక్షర్ కూడా ధాటిగా ఆడాడు. చకచకా బౌండరీలు బాదాడు. స్టబ్స్ తొలి 23 బంతుల్లో 26 పరుగులే చేసినా.. దిల్లీ కోలుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. 15 ఓవర్లు ముగిసేసరికి దిల్లీ 130/4తో లక్ష్యం వైపు సాగింది. తర్వాతి రెండు ఓవర్లలో 9 పరుగులే రావడం, అక్షర్ (26) రిటైర్డ్‌హర్ట్ కావడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. ఆ స్థితిలో స్టబ్స్.. భువి బౌలింగ్‌లో ఓ సిక్స్, సలామ్ ఓవర్లో ఫోర్ కొట్టాడు. ఆఖరి ఓవర్లో (షెపర్డ్) దిల్లీకి 15 పరుగులు అవసరం కాగా.. తొలి రెండు బంతుల్లో రెండు పరుగులే రావడంతో ఉత్కంఠ పెరిగింది. కానీ ఒత్తిడిలో మిల్లర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. వరుసగా 6, 6, 4 బాదేసి దిల్లీకి విజయాన్నందించాడు.

సాల్ట్ మెరిసినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు సాల్ట్, కోహ్లి (19) శుభారంభాన్నిచ్చారు. అయిదు ఓవర్లలో స్కోరు 52/0. మొదట దూకుడు ప్రదర్శించింది కోహ్లినే. మరోవైపు తొలి 13 బంతుల్లో 13 పరుగులే చేసిన సాల్ట్ క్రమంగా జోరందుకున్నాడు. ఆరో ఓవర్లో కోహ్లి వెనుదిరిగినా.. పడిక్కల్ (18) తోడుగా సాల్ట్ జోరు కొనసాగించాడు. 30 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. కానీ పదో ఓవర్లో జట్టు స్కోరు 99 వద్ద పడిక్కల్‌ను అక్షర్ ఔట్ చేయడంతో బెంగళూరు ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు.. వేగంగా పరుగులు చేయలేకపోయింది. 11వ ఓవర్లో సాల్ట్‌ను కుల్‌దీప్ వెనక్కి పంపగా.. పాటీదార్ (8) త్వరగానే నిష్క్రమించాడు. టిమ్ డేవిడ్ (26; 17 బంతుల్లో 3×4, 1×6) కొన్ని చక్కని షాట్లు ఆడాడు కానీ... అతడి జోరును అక్షర్ ఎక్కువసేపు సాగనివ్వలేదు. 16వ ఓవర్లో డేవిడ్ నిష్క్రమించేటప్పటికి ఆర్సీబీ స్కోరు 146. ఆ జట్టు ఆఖరి నాలుగు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 27 పరుగులు మాత్రమే చేయగలిగింది.





### స్కోరు వివరాలు

**బెంగళూరు ఇన్నింగ్స్:**
**సాల్ట్ (సి) స్టబ్స్ (బి) కుల్‌దీప్ యాదవ్ 63; కోహ్లి (సి) నిశాంక (బి) ఎంగిడి 19; దేవ్‌దత్ పడిక్కల్ (సి) మిల్లర్ (బి) అక్షర్ 18; పాటీదార్ (సి) రాహుల్ (బి) ముకేశ్ 8; టిమ్ డేవిడ్ (సి) నటరాజన్ (బి) అక్షర్ 26; జితేశ్ శర్మ (సి) మిల్లర్ (బి) ఎంగిడి 14; రొమారియో షెపర్డ్ ఎల్బీ (బి) కుల్‌దీప్ యాదవ్ 1; కృనాల్ పాండ్య రనౌట్ 12; రసిఖ్ సలామ్ నాటౌట్ 0; భువనేశ్వర్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 175; వికెట్ల పతనం: 1-52, 2-99, 3-105, 4-131, 5-146, 6-149, 7-172, 8-172; బౌలింగ్: అకిబ్ నబి 3-0-36-0; ముకేశ్ కుమార్ 4-0-32-1; ఎంగిడి 4-0-39-2; కుల్‌దీప్ యాదవ్ 4-0-32-2; నటరాజన్ 2-0-16-0; అక్షర్ 3-0-18-2**

**దిల్లీ ఇన్నింగ్స్:**
**నిశాంక ఎల్బీ (బి) భువనేశ్వర్ 1; రాహుల్ (సి) కోహ్లి (బి) కృనాల్ 57; కరుణ్ నాయర్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 5; సమీర్ రిజ్వీ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 2; స్టబ్స్ నాటౌట్ 60; అక్షర్ రిటైర్డ్‌హర్ట్ 26; మిల్లర్ నాటౌట్ 22; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (19.5 ఓవర్లలో 4 వికెట్లకు) 179**
**వికెట్ల పతనం**
**: 1-2, 2-16, 3-18, 4-87**
**బౌలింగ్:**
**భువనేశ్వర్ 4-0-26-3; హేజిల్‌వుడ్ 4-0-38-0; రసిఖ్ సలామ్ 4-0-40-0; కృనాల్ పాండ్య 4-0-24-1; సుయాశ్ శర్మ 3-0-31-0; రొమారియో షెపర్డ్ 0.5-0-17-0**



## అమ్మాయిలు పుంజుకుంటారా?

దక్షిణాఫ్రికాతో రెండో టీ20 నేడు
సాయంత్రం 5.30 నుంచి

డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనను ఓటమితో ఆరంభించిన భారత మహిళల జట్టు.. ఆదివారం రెండో మ్యాచ్‌లో పుంజుకోవాలని చూస్తోంది. అయిదు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత బ్యాటింగ్, బౌలింగ్ రెండూ అంచనాలకు తగ్గట్లు సాగలేదు. మొదట హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్లకు 157 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 19.1 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ షెఫాలి వర్మ (34) జట్టుకు శుభారంభాన్నివ్వగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (47), జెమీమా రోడ్రిగ్స్ (36) కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ ఇన్నింగ్స్‌కు సరైన ముగింపునివ్వడంలో జట్టు విఫలమైంది. చివరి 5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 33 పరుగులే చేయగలిగింది. రెండో టీ20లో భారత్ ఫినిషింగ్ మీద దృష్టిపెట్టాల్సి ఉంది. రిచా ఘోష్ తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరముంది. బౌలర్లలో శ్రేయాంక పాటిల్ (2/26), శ్రీచరణి (1/26) మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. సూపర్ ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్‌ను అడ్డుకోవడం భారత జట్టుకు కీలకం.

# సొంతగడ్డపై సన్‌రైజర్స్ మరో విజయం



**అభిషేక్, క్లాసెన్ మెరుపులు**
**చెన్నైకి తప్పని ఓటమి**

**విజయానికి 60 బంతుల్లో 84 పరుగులు. చేతిలో 7 వికెట్లున్నాయి. ఈ సమీకరణం చూసి చెన్నై గెలుపు ఖాయమే అనుకున్నారంతా. కానీ సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుతమే చేసింది. పిచ్, పరిస్థితులను చక్కగా సద్వినియోగం చేసుకున్న ఆ జట్టు బౌలర్లు స్ఫూర్తిమంతమైన ప్రదర్శనతో అదరగొట్టారు. బంతి బంతికి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచుతూ చెన్నై చేతుల్లోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. సొంతగడ్డపై సన్‌రైజర్స్ రెండో విజయం నమోదు చేయగా.. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న చెన్నైకి సీజన్‌లో నాలుగో ఓటమి ఎదురైంది.**

సన్‌రైజర్స్ అదరగొట్టింది. ఆశల్లేని మ్యాచ్‌లో అద్భుతంగా పుంజుకుని ప్రత్యర్థిని చిత్తుచేసింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ 10 పరుగుల తేడాతో చెన్నైని ఓడించింది. అభిషేక్‌శర్మ (59; 22 బంతుల్లో 6×4, 4×6), హెన్రిచ్ క్లాసెన్ (59; 39 బంతుల్లో 6×4, 2×6) మెరుపులతో మొదట సన్‌రైజర్స్ 9 వికెట్లకు 194 పరుగులు సాధించింది. అనంతరం చెన్నై 8 వికెట్లకు 184 పరుగులే చేయగలిగింది. ఇషాన్ మలింగ (3/29), నితీశ్‌కుమార్‌రెడ్డి (2/31) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. సీజన్లో సన్‌రైజర్స్‌కిది మూడో విజయం.

చెన్నై చేజేతులా..: గత మ్యాచ్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శన చేసిన ప్రఫుల్ హింగేకు.. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్ (7) సిక్సర్‌తో స్వాగతం పలికాడు. రుతురాజ్ (19; 13 బంతుల్లో 3×4) రెండు బౌండరీలు బాదడంతో ఈ ఓవర్లో ప్రఫుల్ 15 పరుగులు సమర్పించుకున్నాడు. అయితే నితీశ్ రెండో ఓవర్ తొలి బంతికే ప్రమాదకర బ్యాటర్ శాంసన్‌ను ఔట్ చేసి సన్‌రైజర్స్ శిబిరంలో జోష్ తీసుకొచ్చాడు. ఈ దశలో రుతురాజ్‌కు జతకలిసిన ఆయుష్ మాత్రే (30; 13 బంతుల్లో 5×4, 1×6) తనదైన శైలిలో షాట్లు ఆడాడు. ప్రఫుల్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ఒక సిక్సర్, 3 బౌండరీలతో చెలరేగిన ఆయుష్ 24 పరుగులు రాబట్టాడు. దీంతో 3.1 ఓవర్లలోనే చెన్నై స్కోరు అర్ధసెంచరీ దాటేసింది. అయితే ఆయుష్.. నితీశ్ బౌలింగ్‌లో క్లాసెన్ అద్భుతమైన క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆ వెంటనే రుతురాజ్‌ను మలింగ వెనక్కి పంపగా.. పవర్ ప్లే ముగిసేసరికి చెన్నై 76/3తో నిలిచింది. సర్ఫరాజ్ (25) దూకుడుగా ఆడటంతో స్కోరు 8.5 ఓవర్లలో 100 పరుగులు దాటి, చెన్నై గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే తర్వాత పిచ్ నుంచి బౌలర్లకు సహకారం లభించడంతో బ్యాటింగ్ కష్టమైంది. బంతి సరిగా బ్యాటుపైకి రాకపోవడంతో సర్ఫరాజ్, షార్ట్ పరుగులు రాబట్టడంలో ఇబ్బంది పడ్డారు. సర్ఫరాజ్ భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరగ్గా.. ప్రమాదకర బ్రెవిస్ డకౌటయ్యాడు. 11 ఓవర్లకు స్కోరు 115/5. ఆ జట్టు విజయానికి 48 బంతుల్లో 80 పరుగులు కావాలి. ఈ దశలో నితీశ్ తన ఓవర్లో 5 పరుగులే ఇవ్వడంతో చెన్నైపై ఒత్తిడి మరింత పెరిగింది. అయితే ప్రఫుల్ 14వ ఓవర్లో సమర్పించుకోవడంతో చెన్నై మళ్లీ పోటీలోకి వచ్చింది. షార్ట్ (34), దూబె (21) క్రీజులో ఉండడంతో ఆ జట్టు గెలిచేలా కనిపించింది. అయితే చివరి ఓవర్లలో ఎంతో కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ వికెట్లు పడగొట్టిన సన్‌రైజర్స్ బౌలర్లు జట్టును గెలిపించారు. ప్రఫుల్ వేసిన చివరి ఓవర్లో 18 పరుగులు అవసరం ఉండగా.. చెన్నై 7 పరుగులే చేసింది.

మెరుపు ఆరంభం.. పేలవ ముగింపు: అంతకుముందు అభిషేక్ దూకుడుతో సన్‌రైజర్స్‌కు మెరుపు ఆరంభం దక్కగా.. ఎప్పట్లాగే ఆ జట్టు ఇన్నింగ్స్‌ను సరిగా ముగించలేకపోయింది. రెండో ఓవర్లో సిక్సర్‌తో బ్యాట్‌కు పనిచెప్పిన అభిషేక్.. తర్వాత మరింత చెలరేగాడు. స్పిన్నర్ షార్ట్ వేసిన అయిదో ఓవర్లో అతను విశ్వరూపం చూపించాడు. అతను వరుసగా 4, 4, 4, 6, 6 బాదడంతో ఆ ఓవర్లో ఏకంగా 25 పరుగులు సాధించాడు. అభిషేక్ కేవలం 15 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. మరోవైపు హెడ్ కూడా ముకేశ్ చౌదరి (2/21) బౌలింగ్‌లో మూడు ఫోర్లు కొట్టాడు. 5.4 ఓవర్లలో 75/0తో సన్‌రైజర్స్ తిరుగులేని స్థితికి చేరుకుంది. కానీ ముకేశ్.. వరుస బంతుల్లో రెండు వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్ జోరుకు అడ్డుకట్ట వేశాడు. ఫుల్ టాస్ బంతికి హెడ్ ఔటవగా.. అనవసర షాట్‌తో ఇషాన్ వికెట్ పారేసుకున్నాడు. పవర్ ప్లే ముగిసేసరికి సన్‌రైజర్స్ 75/2తో నిలిచింది. 51 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడిన అభిషేక్.. ఒవర్టన్ (3/37) బౌలింగ్‌లో వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అభిషేక్‌ను అంపైర్ ఔటివ్వకపోయినా.. ఒవర్టన్‌తో పాటు ఫీల్డర్లెవరూ అప్పీల్ చేయలేదు. కానీ సంజు మాత్రం నమ్మకంగా సమీక్షకు వెళ్లాలని సూచించాడు. సమీక్ష సఫలమవడంతో అభిషేక్ వెనుదిరిగాడు. కొద్దిసేపటికే అనికేత్‌వర్మ (2), నితీశ్‌కుమార్‌రెడ్డి (12) కూడా ఔటవడంతో భారమంతా క్లాసెన్‌పైనే పడింది. అతను 32 బంతుల్లో అర్ధసెంచరీ సాధించి జట్టును మెరుగైన స్థితిలో నిలిపాడు. క్లాసెన్ ఔటయ్యేటప్పటికీ స్కోరు 17.2 ఓవర్లలో 177. స్కోరు 210 వరకు వెళ్తుందని అనుకుంటే.. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన లివింగ్‌స్టన్ (5 బంతుల్లో 1) పేలవ ప్రదర్శన చేశాడు. చివరి 16 బంతుల్లో సన్‌రైజర్స్ 17 పరుగులే చేసింది.

ఉప్పల్ పసుపుమయం

గత మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించి జోరుమీదున్న జట్టు సన్‌రైజర్స్. ఆ వెంటనే జరిగే మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీకి ఒక రేంజ్ అభిమానం పోటెత్తడం సహజం. కానీ శనివారం మాత్రం సన్‌రైజర్స్.. చెన్నైలో ఆడుతున్నట్లు అనిపించింది. ధోని, సీఎస్కే అభిమానులు ఉప్పల్ స్టేడియాన్ని పసుపుమయం చేశారు. స్టేడియం బయటా.. లోపలా ఎక్కువగా ఎల్లో జెర్సీలే కనిపించాయి. టాస్ సమయంలో ఇషాన్ కంటే రుతురాజ్‌కే ఎక్కువ కేరింతలు వినిపించాయి. చెన్నై టాస్ గెలవగానే స్టేడియం మారుమోగింది. సన్‌రైజర్స్ వికెట్ పడగానే స్టేడియం దద్దరిల్లిపోయింది. మ్యాచ్ ఆసాంతం సీఎస్కే.. సీఎస్కే నినాదాలతో అభిమానులు హోరెత్తించారు. అయితే ఈ మ్యాచ్‌లో ధోని ఆడతాడేమో అన్న అంచనాతో స్టేడియానికి వచ్చిన అభిమానులకు నిరాశ తప్పలేదు.

### స్కోరు వివరాలు

**హైదరాబాద్ ఇన్నింగ్స్:**
**అభిషేక్ (సి) శాంసన్ (బి) ఒవర్టన్ 59; హెడ్ (సి) గైక్వాడ్ (బి) ముకేశ్ 23; ఇషాన్ (సి) గైక్వాడ్ (బి) ముకేశ్ 0; క్లాసెన్ (బి) కాంబోజ్ 59; అనికేత్ (సి) నూర్ (బి) ఒవర్టన్ 2; నితీశ్ (సి) షార్ట్ (బి) ఒవర్టన్ 12; సలిల్ (సి) బ్రెవిస్ (బి) గుర్జన్‌ప్రీత్ 13; లివింగ్‌స్టన్ (సి) బ్రెవిస్ (బి) కాంబోజ్ 1; శివాంగ్ (సి) గుర్జన్‌ప్రీత్ (బి) కాంబోజ్ 12; ప్రఫుల్ 0 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 194**
**వికెట్ల పతనం: 1-75, 2-75, 3-93, 4-112, 5-147, 6-177, 7-179, 8-193, 9-194**
**బౌలింగ్: మాథ్యూ షార్ట్ 3-0-38-0; ముకేశ్ 2-0-21-2; అన్షుల్ కాంబోజ్ 3-0-22-3; నూర్ అహ్మద్ 4-0-33-0; జేమీ ఒవర్టన్ 4-0-37-3; గుర్జన్‌ప్రీత్ సింగ్ 4-0-34-1**


**చెన్నై ఇన్నింగ్స్:**
**శాంసన్ (సి) క్లాసెన్ (బి) నితీశ్ 7; రుతురాజ్ (సి) సలిల్ (బి) మలింగ 19; మాత్రే (సి) క్లాసెన్ (బి) నితీశ్ 30; షార్ట్ (సి) అనికేత్ (బి) మలింగ 34; సర్ఫరాజ్ (సి) నితీశ్ (బి) మలింగ 25; బ్రెవిస్ (సి) లివింగ్‌స్టన్ (బి) శివాంగ్ 0; దూబె (బి) సకిబ్ 21; ఒవర్టన్ (సి) లివింగ్‌స్టన్ (బి) ప్రఫుల్ 16; కాంబోజ్ నాటౌట్ 13; నూర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 18 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 184**
**వికెట్ల పతనం: 1-15, 2-66, 3-66, 4-112, 5-113, 6-148, 7-154, 8-182**
**బౌలింగ్:**
**ప్రఫుల్ 4-0-60-1; నితీశ్ 4-0-31-2; సకిబ్ 4-0-32-1; ఇషాన్ మలింగ 4-0-29-3; శివాంగ్ 3-0-18-1; అభిషేక్ 1-0-13-0**




## ప్రపంచ అథ్లెటిక్స్ రిలే పోటీలకు 'లక్ష్య' నిత్య

ప్రపంచ అథ్లెటిక్స్ రిలే పోటీల్లో పాల్గొనే భారత జట్టులో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారిణి నిత్య గంధె చోటు దక్కించుకుంది. మే 2, 3 తేదీల్లో బొట్స్‌వానాలో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ జరుగుతుంది. మహిళల 4×100 మీ. రిలే, మిక్స్‌డ్ 4×100 మీ. రిలే ఈవెంట్లలో బరిలోకి దిగే జట్లలో నిత్య సభ్యురాలు. వీటితో పాటు పురుషుల 4×400 మీ. రిలే, 4×100 మీ.రిలే, 4×400 మీ. మిక్స్‌డ్ రిలే ఈవెంట్లలో పోటీ పడే జట్ల కోసం మొత్తం 21 మంది క్రీడాకారులను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఎంపిక చేసింది. 4×400 మీ. మహిళల రిలే పోటీలకు కూడా భారత్ అర్హత సాధించినప్పటికీ.. సభ్యుల్లో కొందరు గాయాలతో బాధ పడుతుండడంతో ఈ జట్టును టోర్నీకి పంపట్లేదు.

## ఎస్ఆర్‌హెచ్‌లో కొయెట్జీ



హైదరాబాద్: దక్షిణాఫ్రికా పేసర్ జెరాల్డ్ కొయెట్జీ సన్‌రైజర్స్ జట్టులో చేరాడు. చీలమండ గాయం కారణంగా ఈ ఐపీఎల్ మొత్తానికి దూరమైన డేవిడ్ పైన్ స్థానంలో అతణ్ని తీసుకున్నట్లు హైదరాబాద్ ప్రకటించింది. రూ. 2 కోట్ల కనీస ధరకు కొయెట్జీ ఎస్ఆర్‌హెచ్‌కు ఆడనున్నాడు. గతంలో గుజరాత్, ముంబయి జట్లకు ప్రాతినిధ్యం వహించిన అతడు.. 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లాడిన పైన్ 2 వికెట్లు తీశాడు.